క్లుప్తంగా

నేడు వరలక్ష్మి వ్రతం

బుచ్చిరెడ్డిపాళెం : శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు గురువారం తెలిపారు. వ్రతంలో పాల్గొనే మహిళా భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని అందిస్తున్నట్లు తెలియజేశారు.

- పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంతో పాటు అయ్యప్పనగర్లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 9 గంటలకు వరలక్ష్మి వ్రతం జరుగుతుందని దేవస్థానం కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

పద్మనాభసత్రంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు : మండలంలోని పద్మనాభసత్రంలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య బృందం వారు గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇద్దరు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. వైద్యాధికారి గీతా సాహితి, హెచ్ఎస్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ బి.శ్రీలత, హెచ్ఏలు సీహెచ్.సుధాకర్, టి.దొరసానమ్మ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

మనుబోలు : ఎడగారులో పంట సాగు చేస్తున్న రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ సూచించారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో ఆర్బీకే సిబ్బంది చేపట్టిన ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి పంట రుణాలు, బీమా సౌకర్యాలు అందుతాయన్నారు. పీఎం కిసాన్‌కు కూడా ఈకేవైసీ ఉండాలని తెలిపారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం : విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కోటపూరి ఆనందరావును బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని కేఏఆర్ జూనియర్ కళాశాలలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ జిల్లా ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగిన వెటరన్ పోటీల్లో ఆనందరావు అనేక పతకాలు సాధించారని, దీనిని పురస్కరించుకుని ఆయన్ను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాఘవన్, వేణు, జిలానీబాషా, సుందర్‌రావు, కళాశాల కరస్పాండెంట్ దిలీప్ పాల్గొన్నారు.

29 వరకు తెలుగుభాషా వారోత్సవాలు

కోవూరు(విడవలూరు) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుజాత మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఈనెల 29న ఉందని, ఈ సందర్భంగా 23వ తేదీ నుంచి 29 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా క్విజ్, పద్య పఠనం, వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆయా పోటీల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనాలని సూచించారు.

అభివృద్ధిపై విమర్శలు తగవు

- సర్పంచ్ హరిత



కొడవలూరు: మండలంలోని దామేగుంటలో జరిగిన అభివృద్ధిపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం తగదని గ్రామ సర్పంచ్ చిమటా హరిత అన్నారు. గ్రామంలో గురువారం ఆమె మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో గ్రామంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రూ.57 లక్షలతో ఆరు సిమెంట్ రోడ్లు వేశామని, రూ.30 లక్షలతో రామతీర్థం రోడ్డు నుంచి దామేగుంట వరకు మెటల్ రోడ్డు వేసినట్లు తెలిపారు. రూ.10 లక్షలతో డ్రెయిన్, రూ.7 లక్షలతో వాటర్‌ప్లాంట్, రూ.9 లక్షలతో కాలువల మరమ్మతులు చేపట్టామన్నారు. రూ.85 లక్షలతో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని లబ్ధిదారులకు రూ.5 కోట్లు అందినట్లు తెలియజేశారు. వీటిని గుర్తించకుండా టీడీపీ నేత దినేష్‌రెడ్డి మాట్లాడటం తగదన్నారు.

ట్రాక్టర్ స్వాధీనం

ఇందుకూరుపేట : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పల్లిపాడు గ్రామం వద్ద సెబ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలోని పల్లిపాడు ఇసుక రీచ్ నుంచి అనుమతుల్లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా తమ సిబ్బందితో దాడులు చేశామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్ రాజేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

బడుగుల ఇళ్లకు ఆర్థిక భరోసా

- ఎస్టీల ఇళ్ల నిర్మాణాల పూర్తికి మంత్రి కాకాణి ప్రత్యేక శ్రద్ధ
- 1,199 మందికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం



ఆర్థిక సాయం పొందిన వెంకటాచలం లబ్ధిదారులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

వెంకటాచలం : బడుగుల సొంతింటి కలను సాకారం చేసేందుకు సర్వేపల్లి నియోజకవర్గంలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ప్రజా సంకల్ప యాత్రలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, తోటపల్లిగూడూరు మండలాల్లో 20,979 ఇళ్లను మంజూరు చేశారు. గ్రామాల్లో విలువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి అన్ని వసతులతో లేఅవుట్లు నిర్మించి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో పేదల సొంతింటికి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. గ్రామానికి ఒకరికో, ఇద్దరికో ఇల్లు మంజూరు చేసినా బిల్లులు మంజూరు కాక లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ఇంటిని నిర్మించుకున్న దాఖలాల్లేవు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పేదరికమే ప్రామాణికంగా తీసుకుని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయడంతో లబ్ధిదారుల సంతోషానికి అవధుల్లేవు.

ఎస్టీలకు మంత్రి కాకాణి ఆర్థిక సాయం

సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ ఇలా అన్ని కులాల వారికి కలిపి 20,979 ఇళ్లు మంజూరు చేశారు. హౌసింగ్, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలతో పాటుగా పొదుపు గ్రూపుల్లో ఉన్న మహిళలకు అదనంగా రూ.35 వేల వడ్డీలేని రుణం మంజూరు చేస్తోంది. దీంతో ఎస్టీలు మినహాయించి మిగతా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకుంటున్నారు. ఎస్టీలు ఆర్థికంగా వెనుకబడి ఉండటం, అవగాహన లేమితో పొదుపు గ్రూపుల్లో లేకపోవడంతో రూ.35 వేల వడ్డీలేని రుణం పొందలేక ఇంటి నిర్మాణాల పనులను పూర్తి చేసుకోవడంలో వెనుకబడి ఉన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నియోజకవర్గంలో ఎంత మంది ఎస్టీ లబ్ధిదారులు ఉన్నారో జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం ఐదు మండలాల్లో కలిపి 1,199 లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. తొలి విడతలో 423 మందికి, రెండో విడతలో 776 మంది రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. రెండో విడత కింద రూ.15 వేల ఆర్థిక సాయం చెక్కుల పంపిణీని అన్ని మండలాల్లో మంత్రి కాకాణి చేతుల మీదుగా ఇటీవల పూర్తి చేశారు. మంత్రి ఆర్థిక సాయంతో ప్రస్తుతం ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను చేయించుకుంటున్నారు. సొంతింటి కలను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని లబ్ధిదారులు వెల్లడిస్తున్నారు.

మండలాల వారీగా ఎస్టీల వివరాలు	
వెంకటాచలం	391
మనుబోలు	266
ముత్తుకూరు	243
తోటపల్లిగూడూరు	272
పొదలకూరు	27
మొత్తం	: 1,199



వెంకటాచలంలో ఇళ్లు నిర్మించుకున్న ఎస్టీలు

మంత్రి కాకాణికి రుణపడి ఉంటాం



ఏళ్ల తరబడి సొంతింటి కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇంటి స్థలంతో పాటుగా, ఇల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోలేకుంటే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఇది తమకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మంత్రి కాకాణి జీవితాంతం రుణపడి ఉంటాం.

– గుండుబోయిన చెంచమ్మ, సర్వేపల్లి

ఆర్థిక సాయాన్ని మర్చిపోలేం



నిరుపేదలైన ఎస్టీలకు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించడం ఎప్పటికీ మరిచిపోలేం. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో ఇల్లు పూర్తి కాకపోవడంతో తాము చివరి దశలో పనులు నిలిపి ఉన్నాం. ఈ దశలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం చేయడంతో అందరూ పనులు పూర్తి చేసుకుంటున్నారు.

– ఈగ పద్మమ్మ, సర్వేపల్లి

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి



కలశాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మనుబోలు : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధనోత్సవాన్ని మనుబోలు బీసీకాలనీ సమీపంలోని వెంకయ్య స్వామి ఆలయంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు ఉదయం మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యావచనం, పంచామృతాభిషేకం నిర్వహించి వెంకయ్యస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. నదీ జలాలతో శిఖరానికి అభిషేకం గావించారు. భక్తులు కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పూజలు చేశారు. భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. ప్రత్యేక పూజలు తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం బయట హోమ గుండం వేసి శాస్త్రోక్తంగా ధుని పూజ జరిపించారు. కల్యాణం, సంతానం కోసం భక్తులు నవధాన్యాలను హోమ గుండంలో వేసి వ్రతాలు ఆచరించారు. ఉభయకర్తలుగా ముంగర విజయభాస్కర్‌రెడ్డి-విజయమ్మ దంపతులు వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి పల్లకిసేవతో ఆరాధన మహోత్సవాలు ముగిశాయి.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కోవూరు : కోవూరు ఇనమడుగు సెంటర్‌లో అట్లూరు సుబ్రహ్మణ్యం మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను డీఏఏబీ చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి కోవూరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. అనంతరం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు చిరంజీవి, పార్టీ నేతలు మందా రవి, కందల గిరిబాబు, రమణయ్య, హరి, చింటు, చక్రి, మౌలీ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

పొదలకూరు : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పొదలకూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద గురువారం నాబార్డ్ సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ఎస్ఎస్ భగవాన్ మాట్లాడుతూ బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల సేవలను కళాజాత ద్వారా వివరించినట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలకు రూ.20 లక్షల వరకు రుణాలను అందజేస్తున్నామని, విద్యా, గృహ రుణాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. సీఈఓ సందాని పాల్గొన్నారు.



బాధితులకు ఆపన్న హస్తం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులో ఇటవల అగ్నిప్రమాదం జరిగి మూడు కుటుంబాలు రోడ్డున పడిన విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం వారికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.10 వేల చొప్పున రూ.30 వేలను 18వ వార్డులోని పెద్దూరులో అందించారు. అలాగే ముత్తుకూరు లక్ష్మమ్మకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో రూ.20 వేలు, అశేషానంద అనే వ్యక్తికి రూ.10 వేలు, నావూరు ఉష అనే ఒంటరి మహిళకు రూ.20 వేలను అందజేశారు. అలాగే దర్గిగుంట నాగేంద్ర అనే దివ్యాంగునికి రూ.35 వేల విలువ చేసే బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, షకీలాబేగం, యానాదిరెడ్డి, నాగరాజు, మల్లారెడ్డి, అనంతమ్మ, ప్రమీలమ్మ, శ్రీదేవి, రహమత్, పుట్టా లక్ష్మీకాంతమ్మ, శివకుమార్‌రెడ్డి, నాయకులు అల్లాభక్షు, విల్సన్, కామేశ్వరమ్మ, ప్రవళ్లిక, భరత్, మేనకూరు సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి ఆశీస్సులు సీఎంకు ఉండాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



స్వామివారి రథాన్ని లాగుతున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి శాశ్వత సీఎంగా ఉండేలా భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఉదయం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు గొలగమూడి వెంకయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత సీఎంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. మరో ఐదేళ్ల పాటు వెంకయ్యస్వామి సేవలో తరించే అవకాశం తనకు కలిగించాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకయ్యస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. భక్తులతో కలిసి రథాన్ని లాగారు. అలాగే కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి సతీమణి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని మంత్రి కాకాణి ప్రారంభించి, అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, తహసీల్దార్ కృష్ణ, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నంబూరు రాజానాయుడు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వం తెప్పోత్సవం

వెంకటాచలం : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 41వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. విశేష పుష్పమాలికలతో అలంకరించిన తెప్పపై వెంకయ్యస్వామిని కొలువుదీర్చి ఉత్సవం జరిపారు. అంగరంగ వైభవంగా సాగిన తెప్పోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. వేలాది సంఖ్యలో భక్తులు కోనేటి కట్టపై చేరడంతో పోలీసులు నలువైపులా గట్టి బందోబస్తు నిర్వహించారు. తెప్పోత్సవంతో వెంకయ్యస్వామి 41వ ఆరాధన మహోత్సవాలు ముగిశాయి.

ఎస్పీ పరిశీలన

వెంకయ్యస్వామి తెప్పోత్సవాన్ని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి గురువారం రాత్రి పరిశీలించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు, భక్తుల రద్దీ, భోజన వసతి, పార్కింగ్, తెప్పోత్సవ కార్యక్రమాలపై ఆలయ ఈఓతో ఆరాతీశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం తెప్పోత్సవం వద్ద పూజలు నిర్వహించారు.



వేడుకగా సాగుతున్న తెప్పోత్సవం



స్వామివారి పూజల్లో పాల్గొన్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఆర్థిక సాయం అందజేత



పొదలకూరు : మండలంలోని బిరదవోలు పంచాయతీ ముత్యాలపేటకు చెందిన బుధవరపు వెంకటరమణయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఉండడంతో చేనేత ఐక్యవేదిక నేతలు గురువారం ఆయన వద్దకు వెళ్లి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఐక్యవేదిక ద్వారా ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు నందం అశ్వద్ధామ, రామనాథం రాజశేఖర్, ఆశం సురేష్, సోమా గోపాల్, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, పి.సురేష్ పాల్గొన్నారు.

నాణేల స్వాహాపై ముమ్మర దర్యాప్తు

పొదలకూరు : చిట్టేపల్లి అంకమ్మతిప్ప వద్ద లభ్యమైన పురాతన బంగారు నాణేల స్వాహాలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాగా గురువారం అమరావతి నుంచి సెంట్రల్ ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా టాస్కింగ్ స్టాఫ్ వింజమూరు ప్రతాప్ స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చి కేసు వివరాలను సీఐ సంగమేశ్వరరావు వద్ద సేకరించారు. ప్రస్తుతం విచారణలో నిందితులుగా అంకయ్య, అమరన్, అజిత్‌లపై కేసు నమోదు చేసి రూ.15 లక్షల విలువైన బంగారు నాణేలతో పాటు నిందితులు చెన్నైలో అమ్మిన ఆభరణాలు ద్వారా వచ్చిన రూ.14 లక్షల నగదుతో వారు కొనుగోలు చేసిన ఆటో, పాతకారులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. విజయనగర కాలం నాటి నాణేలుగా పురావస్తుశాఖ వారు గుర్తించినట్లు తెలుస్తోంది.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

- ఎంపీపీ వజ్రమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ వజ్రమ్మ

మనుబోలు : ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల జాప్యం వల్ల పేదలు నష్టపోతున్నారని, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయని కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2018–19 సంవత్సరాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు పడలేదని హౌసింగ్ ఏఈ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఏఈ స్పందిస్తూ బిల్లుల కోసం ప్రత్యేక యాప్ అందుబాటులోకి వచ్చిందని, యాప్‌లో నమోదు చేయగానే బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. ఎంఈఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో మూడో విడత నాడు–నేడు కింద 16 పాఠశాలలు ఎంపికయ్యాయని, డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలలకు పంపేలా ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, మండల ఉపాధ్యక్షులు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, గుండాల చందన, ఈఓపీఆర్డీ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి జహీర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే తోటపల్లి అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దళిత నేతలు

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే తోటపల్లి పంచాయతీ అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌సీపీ దళిత నేతలు పేర్కొన్నారు. తోటపల్లి పంచాయతీ కామాక్షినగర్‌లో వారు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానా రాజేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో తోటపల్లి పంచాయతీలో సీసీరోడ్లు, మురుగు కాలువలు, కామాక్షినగర్‌లో వాటర్‌ప్లాంట్, జగనన్న లేఅవుట్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అయితే ఊరికి చుట్టపు చూపుగా వచ్చే కొండూరు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి దళితులకు అన్యాయం జరిగిందంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంబేటి వీరరాఘవులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దళితులకు అన్నివిధాలా అండగా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు దారా హరికృష్ణ, ఈదూరు నరేంద్ర, ఎంబేటి వెంకటేశ్వర్లు, ఇంగిలాల మనోహర్, మూగ ధనుంజయ, మీదూరు విశ్వనాథ్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ



పొదలకూరు : చంద్రయాన్–3 విజయవంతంపై పట్టణంలోని చైతన్య విద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్రవేత్తలను అభినందిస్తూ నినాదాలు చేశారు. భారతదేశానికి శాస్త్రవేత్తలు గర్వకారణంగా నిలిచినట్లు పేర్కొన్నారు.

300 మీటర్ల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన

ముత్తుకూరు : చంద్రయాన్–3 విజయవంతం కావడంతో స్థానిక వీబీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. 300 మీటర్ల భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ స్కూల్ నుంచి బజారు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ప్రశంసిస్తూ, జై భారత్, జై ఇండియా అంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో ఇస్రో చేపట్టే ప్రయోగాలు విజయవంతం కావాలంటూ ఆకాంక్షించారు.



ముత్తుకూరు : భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ